క్లుప్తంగా

సందర్శన



వంటలు పరిశీలిస్తున్న డిప్యూటీఈఓ ప్రసన్నకుమార్

సీతంపేట: మండలంలోని ముత్యాలు గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలను ఐటీడీఏ డిప్యూటీ ఈఓ ఆర్.ప్రసన్నకుమార్ మంగళవారం సందర్శించారు. ఈ సమయంలో టెన్త్ విద్యార్థులకు ప్రీ ఫైనల్ పరీక్షలు జరుగుతుండడంతో పర్యవేక్షించారు. మిగతా తరగతుల విద్యార్థినులు ఎలా చదువుతున్నదీ ఆరా తీశారు. ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలన్నారు. అనంతరం మెనూ పరిశీలించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రావణి పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు



రెబ్బలో వాటర్ స్కీమ్ పరిశీలిస్తున్న జేఈ

కొమరాడ: రానున్న వేసవి నేపథ్యంలో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు చేపడుతున్నామని ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ జి.గౌరీశంకరరావు తెలిపారు. మండలంలోని చోళ్లపదం పంచాయతీ రెబ్బ, వనధార గ్రామాల్లో ఆయన మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏజెన్సీ గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కారం కోసం ప్రతిపాదనలు ఉన్నతాధికారులకు అందజేస్తామన్నారు. నిధులు వచ్చిన వెంటనే ప్రతి గ్రామంలో తాగునీటి సమస్యలు లేకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

అందని రేషన్!

జియ్యమ్మవలస: మండల కేంద్రంలో రేషన్ బియ్యం పంపిణీ చేయాలని లబ్ధిదారులు కోరుతున్నారు. వాస్తవానికి ప్రతి నెలా ఒకటో తేదీ నుంచి 11లోగా రేషన్ బియ్యం పంపిణీ చేసేవారని వారు తెలిపారు. ఈ నెల గ్రామంలో ఇప్పటి వరకు పంపిణీ చేయలేదని తెలిపారు. గ్రామంలో సుమారు 950 కార్డులు ఉండగా ఇప్పటి వరకు ఒక్కరికీ కూడా బియ్యం పంపిణీ చేయలేదని లబ్ధిదారులు వారాడ రమణ, బొత్స గౌరునాయుడు, లచ్చిరెడ్డి గంగమ్మ, సీర శ్రీదేవి తదితరులు తెలిపారు.

రహదారి నిబంధనలు పాటించాలి

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): వాహనదారులు రోడ్డు నిబంధనలు పాటించాలని కురుపాం ఎస్‌ఐ పి.నారాయణరావు కోరారు. కురుపాంలో మంగళవారం ఆయన వాహన తనిఖీలు నిర్వహించారు. సురక్షితంగా వాహనదారులు గమ్యం చేరాలంటే నియమాలు పాటించాల్సిందేనన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని, పరిమితికి మించిన వేగంతో వెళ్లొద్దన్నారు. ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించకూడదని, ఎక్కడపడితే అక్కడే పార్కింగ్ చేసి ట్రాఫిక్ జామ్‌కు కారకులు కావొద్దని సూచించారు. సిబ్బంది ఉన్నారు.

మద్యం విక్రయాలు చేపడితే చర్యలు

పాలకొండ రూరల్: నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయాలు చేపడితే చర్యలు తప్పవని మండల మెజిస్ట్రేట్, తహసీల్దార్ బాలమురళీకృష్ణ స్పష్టం చేశారు. వివిధ రకాల ఎక్సైజ్ కేసుల్లో నిందితులుగా ఉన్న పలువురిని ఆ శాఖ ఎస్సై ఫణీంద్ర పాలకొండ తహసీల్దార్ కోర్టులో మంగళవారం హాజరుపర్చారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. భవిష్యత్‌లో ఇటువంటి చర్యలకు పాల్పడవద్దని సూచించారు. రూ.లక్ష పూచీకత్తుతో నిందితులను బైండవర్ చేయించారు.

విజయగౌరికి మద్దతివ్వండి..

భామిని: ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించగల సత్తా పీడీఎఫ్ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరికే ఉందని, ఆమెకు ఎమ్మెల్సీ ఎన్నికల్లో మద్దతివ్వాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.మురళీమోహనరావు అన్నారు. మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్, జీజే కాలేజ్, కేజీబీవీ, మోడల్, గురుకులాల్లో మంగళవారం ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ దండు ప్రకాశరావు, మండల శాఖ ప్రతినిధులు ఈ.తిరుపతిరావు, కర్రిక ప్రసాద్, జిల్లా కౌన్సిలర్ క్రాంతికుమార్, పి.ఉడుతాచిన్, కార్యవర్గ సభ్యులున్నారు.

అందుబాటులో స్టెమీ ఇంజక్షన్



స్టెమీ ఇంజక్షన్‌పై రోగులకు అవగాహన కల్పిస్తున్న వైద్యులు

జియ్యమ్మవలస: ప్రస్తుత పరిస్థితుల్లో వయసుతో సంబంధం లేకుండా అనేక రకాల ఒత్తిళ్ల వల్ల వస్తున్న గుండెపోటు పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని చినమేరంగి సీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ ఆర్‌కే చైతన్య అన్నారు. గుండెపోటుకు సంబంధించి చినమేరంగి సీహెచ్‌సీలో స్టెమీ ఇంజక్షన్ అందుబాటులో ఉందని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గుండెపోటుపై రోగులకు మంగళవారం అవగాహన కల్పించారు. వైద్యులు డాక్టర్ సునీల్ కుమార్, డాక్టర్ చంద్రవర్మ, సిబ్బంది పాల్గొన్నారు.

సస్యరక్షణతో అధిక లాభాలు

- నువ్వు సాగుపై పెరుగుతున్న ఆసక్తి



సాగులో నువ్వుచేను (ఇన్‌సెట్లో) పూతతో ఉన్న చేను

భామిని: వర్షాలు ఆలస్యంగా కురవడంతో రబీ సీజన్ ఆరుతడి పంటలకు అనుకూలంగా మారింది. ప్రస్తుతం ఎక్కువ మంది రైతులు నువ్వు సాగు చేపడుతున్నారు. మెట్టు, పల్లం భూముల్లో విస్తారంగా నువ్వు పంట సాగు చేస్తున్నారు. అయితే సరైన సస్యరక్షణ చేపడితే అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. వరి పంట సాగు చేసిన భూముల్లో నీటివసతి ఉన్న చోట్ల కొందరు రైతులు నువ్వు సాగు చేస్తున్నారు. అయితే సరైన విత్తన ఎంపిక, మేలైన యాజమాన్యం, సస్యరక్షణ చేపడితే మంచి దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. ఈ పంట నుంచి మంచి ఆదాయం వచ్చే అవకాశం ఉండడంతో రైతులు సాగుకు ముందుకు వస్తున్నారు.

సాగు యాజమాన్యం..

నువ్వుల పంట సాగుకు తేలిక నేలలు అనుకూలం. వేసవిలో పండిన నువ్వులు నాణ్యంగా ఉంటాయి. ఎకరానికి 5 నుంచి 6 క్వింటాళ్ల దిగుబడి సాధించే అవకాశం ఉండడంతో వేసవిలో నువ్వుల సాగు రైతుకు లాభదాయకం. నువ్వుల సాగులో విత్తన రకాల ఎంపిక, చీడపీడల నివారణలో సరైన జాగ్రత్తలు తీసుకుంటే మంచి దిగుబడులు సాధించవచ్చు.

కలుపు నివారణ ముఖ్యం..



నువ్వుల సాగులో కలుపు నివారణ చాలా ముఖ్యం. నువ్వు మొక్కల కంటే కలుపు మొక్కలు ఎత్తు పెరగకుండా చూసుకోవాలి. ఈ పంటకు సల్ఫర్ ఎక్కువగా అందేవిధంగా చూడాలి. వ్యవసాయాధికారుల సూచనల మేరకు ఎరువులు వాడాలి. నువ్వుల పంటకు చీడపీడల సమస్య ఎక్కువగా ఉంటుంది. ముఖ్యంగా గొంగళిపురుగు, పొగాకు లద్దె పురుగు ఎక్కువగా ఆశిస్తాయి. సమగ్ర సస్యరక్షణతో తెగుళ్లను అరికట్టవచ్చు.

– కోర్ను సింహాచలం, ఏఓ, భామిని

నిశిత పరిశీలన..



ఖైదీలు రిమాండ్ కోసం సబ్ జైల్‌కు వచ్చినప్పుడు.. కోర్టు వాయిదాలకు బయటకు తీసుకెళ్లాల్సి వచ్చినప్పుడు నిశితంగా పరిశీలించాలని జిల్లా సబ్‌జైల్ అధికారి కె. మోహన్ సూచించారు. మంగళవారం స్థానిక సబ్‌జైల్‌ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా జైల్ పరిసరాలను పరిశీలించి, పలు సూచనలు చేశారు. సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. అనంతరం రికార్డులు పరిశీలించారు. – పాలకొండ

ప్రచారం..



ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బహుజన సంఘాలు బలపరుస్తున్న అభ్యర్థి పోతల దుర్గారావుకు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘాల స్టేట్ మీడియా కన్వీనర్ అన్ను వెంకటరావు పిలుపునిచ్చారు. మండలంలోని అన్ని విద్యా సంస్థల్లో మంగళవారం ముమ్మరంగా ప్రచారం చేశారు. ఈ నెల 27న జరగనున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో దుర్గారావు నాయకత్వాన్ని బలపరచాలని కోరారు. – వీరఘట్టం

పంటల మార్పిడి విధానంతో అధిక దిగుబడులు



రైతులకు సూచనలిస్తున్న షణ్ముఖరాజు

జియ్యమ్మవలస: పంట మార్పిడి విధానంతోనే అధిక దిగుబడులు సాధించవచ్చని జిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రబంధకులు పి.షణ్ముఖరాజు అన్నారు. రామినాయుడువలస గ్రామంలో రబీ డ్రై షోయింగ్‌లో భాగంగా నువ్వులు ప్రధాన పంటలో ముల్లంగి, గోంగూర, చిక్కుడు, బెండ, కొత్తిమీర మొదలగు పంటలను మంగళవారం పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంట మార్పిడి విధానంలో భాగంగా వరి తరువాత అపరాలు, నువ్వులతో పాటు అదనపు ఆదాయం కోసం పలు పంటలు వేయడం వలన రైతులు త్వరితగతిన అభివృద్ధి చెందడం జరుగుతుందన్నారు. జిల్లాలోని 15 మండలాల్లో ప్రతి గ్రామంలోని ప్రతి రైతు పంట మార్పిడి చేయడం వలన దిగుబడులు సాధించడంతో పాటు ప్రతి ఏడాది పండించడం వలన ఆర్థికాభివృద్ధి సాధించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో యూనిట్ ఇన్‌చార్జ్ లత, రైతులు పాల్గొన్నారు.

మన్యం బంద్‌కు సహకరించండి



కొమరాడ: పోలీసులకు వినతిపత్రం అందజేస్తున్న వామపక్షాల నాయకులు

గుమ్మలక్ష్మీపురం: 1/70 చట్టాన్ని సవరించాలన్న అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు చేసిన వ్యాఖ్యల్ని నిరసిస్తూ బుధవారం నిర్వహించనున్న బంద్‌లో గిరిజనులంతా పాల్గొని విజయవంతం చేయాలని ఎంపీపీ కుంబురుక దీనమయ్య పిలుపునిచ్చారు. మంగళవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ బంద్‌కు వైఎస్సార్‌సీపీ పూర్తి మద్దతునిస్తోందని స్పష్టం చేశారు. అలాగే గుమ్మలక్ష్మీపురం మండల కేంద్రంలో నిర్వహించే నిరసన కార్యక్రమంలో మాజీ డిప్యూటీ సీఎం పాముల పుష్పశ్రీవాణి కూడా పాల్గొననున్నట్టు తెలిపారు.

నేటి బంద్‌కు సహకరించండి

కొమరాడ: గిరిజన హక్కులు కాలరాసే కూటమి ప్రభుత్వ తీరును నిరసిస్తూ బుధవారం చేపట్టనున్న బంద్‌కు అన్ని వర్గాల వారు సహకరించాలని వామపక్ష నాయకులు కొల్లి సాంబమూర్తి, పి.శ్రీనునాయుడు కోరారు. మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో రైటర్ రాజరత్నంకు బంద్‌కు సంబంధించిన వినతపత్రం అందజేశారు. అనంతరం బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దశాబ్దాల నుండి పోరాటం చేసిన సాధించుకున్నా గిరిజన హక్కులు కాపాడుతున్న 1/70 చట్టాన్ని సవరించాలని శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు చేసిన వ్యాఖ్యలకు నిరసనగా బంద్ పాటిస్తున్నామని వర్తక సంఘాలు, ప్రజలు మద్దతు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం, సీపీఐ తదితరులు పాల్గొన్నారు.

నెలాఖరు నాటికి నమోదు ప్రక్రియ పూర్తి చేయాలి

- ఏఓ ఎన్ని వాహిని

పాలకొండ రూరల్: రైతు విశిష్టత సంఖ్య నమోదు కార్యక్రమం కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ నెలాఖరు నాటికి పూర్తి చేయాలని మండల వ్యవసాయాధికారి ఎన్ని వాహిని అన్నారు. మంగళవారం తన కార్యాలయంలో రైతుసేవా కేంద్రాలకు సంబంధించిన సహాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సొంతంగా సెంటు భూమి కలిగిన రైతు కూడా నమోదు చేసుకోవాలన్నారు. కేంద్ర ప్రభుత్వం 14 అంకెల యూనిక్ (గుర్తింపు) కార్డు అందిస్తుందని, దీంతో సంక్షేమ పథకాలు పొందవచ్చని చెప్పారు. రైతు పట్టాదారు పాస్ పుస్తకం నకలుతో పాటు ఆధార్, ఆధార నంబర్‌కు లింకుకాబడిన ఫోన్ తీసుకుని రైతుసేవా కేంద్రాలను సంప్రదించాలన్నారు.

పాలనపై దృష్టి సారించండి..

వీరఘట్టం: పంచాయతీ కార్యదర్శులు పల్లె పాలనపై దృష్టి సారించాలని ఎంపీడీఓ బి.వెంకటరమణ సూచించారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పీఎం సూర్యఘర్, హౌస్‌హోల్డ్ జియో ట్యాగింగ్, పారిశుధ్య పరిరక్షణ, తదితర కార్యక్రమాలను చేపట్టలన్నారు. సమావేశంలో ఏఈ అనిల్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

సబ్‌సెంటర్‌లో చోరీ

భామిని: మండలంలోని పాలవలస సబ్‌సెంటర్‌లో సోమవారం రాత్రి చోరీ జరిగినట్లు స్థానికులు తెలిపారు. కిటికీలు విరగ్గొట్టి దొంగలు లోనికి ప్రవేశించారు. అయితే విలువైన వస్తువులేవీ పోలేదేని సమాచారం. స్థానికుల సమచారం మేరకు బత్తిలి పోలీసులు సబ్‌సెంటర్‌ను పరిశీలించారు.

టెన్త్ విద్యార్థుల పర్యవేక్షణ



టెన్త్ విద్యార్థికి సూచనలిస్తున్న ఎంఈఓలు గౌరునాయుడు, శ్రీనివాసరావు

జియ్యమ్మవలస: మండలంలోని జెడ్పీ హైస్కూల్‌లో పదో తరగతి చదువుతున్న విద్యార్థుల ఇళ్లకు మంగళవారం రాత్రి ఎంఈఓలు గౌరునాయుడు, శ్రీనివాసరావు వెళ్లి పర్యవేక్షించారు. రానున్న పరీక్షల దృష్ట్యా తల్లిదండ్రులతో మాట్లాడి విద్యార్థులు ఇళ్ల వద్ద బాగా చదివేలా, ఆరోగ్యవంతంగా ఉండేలా చూడాలని సూచించారు. వారి వెంట ఉపాధ్యాయులు ఉన్నారు.

నిరంతర పర్యవేక్షణ అవసరం



సిబ్బందికి సూచనలిస్తున్న ప్రోగ్రాం అధికారి జగన్‌మోహన్‌రావు

గరుగుబిల్లి: గర్భిణులు సుఖప్రసవం అయ్యేందుకు నిరంతరం పర్యవేక్షణ అవసరమని వైద్య ఆరోగ్య శాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి టి.జగన్‌మోహనరావు సిబ్బందికి సూచించారు. మండల కేంద్రంలోని పీహెచ్‌సీని ఆయన మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పలువురు గర్భిణులతో మాట్లాడి అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గర్భిణులకు నిరంతరం ఆరోగ్య తనిఖీలు, వైద్య పరీక్షలను నిర్వహించి ఎంసీపీ కార్డులో నమోదు చేయాలన్నారు. హెచ్‌బీ శాతం ప్రతి నెలా వృద్ధి చెందుతుందో.. లేదో కార్డులో నమోదు చేయాలన్నారు. వైద్యాధికారి ఎస్.సంతోష్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

ఎంఎస్‌ఎంఈ సర్వే పరిశీలన

గరుగుబిల్లి: మండలంలో చేపడుతున్న ఎంఎస్‌ఎంఈ సర్వేను ఈఓపీఆర్‌డీ ఎల్.గోపాలరావు పరిశీలించారు. మండలంలోని కొత్తపల్లి గ్రామంలో సూక్ష్మ, చిన్న, మధ్యతరహా సంస్థలు (ఎంఎస్‌ఎంఈ) ఏర్పాటు చేసేందుకు చేపడుతున్న సర్వేను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం రుణాలను మంజూరు చేస్తుందన్నారు. ప్రాంతాలను బట్టి పరిశ్రమలను స్థాపించేందుకు యువత ముందుకు రావాలన్నారు. సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఇళ్లకు ఉపాధ్యాయులు



విద్యార్థి తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ఎంఈఓ, హెచ్‌ఎం, తదితరులు

వీరఘట్టం: మార్చి 17న జరగనున్న టెన్త్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక కార్యచరణ చేపట్టారు. ఇందులో భాగంగా ఎంఈఓ ఆర్.ఆనందరావు, తలవరం హైస్కూల్ హెచ్‌ఎం వై.జగన్, ఉపాధ్యాయులు తలవరం పాఠశాలలో చదువుకుంటున్న పనుకువలస గ్రామానికి చెందిన విద్యార్థుల ఇళ్లకు మంగళవారం వెళ్లి తల్లిదండ్రులతో మాట్లాడారు. పిల్లలపై ఎక్కువ ఒత్తిడి తీసుకురావద్దని సూచించారు. ప్రణాళికాబద్ధంగా చదువుకుంటే మంచి ఫలితం వస్తుందని విద్యార్థులకు తెలిపారు. టీవీలు, సెల్‌ఫోన్లకు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో కె. జనార్ధనరావు, తదితరులు పాల్గొన్నారు.

ఫార్మర్ ఐడీ కోసం నమోదు చేసుకోవాలి



బీరుపాడులో రైతులకు సూచనలిస్తున్న ఏఓ

గుమ్మలక్ష్మీపురం: రైతులంతా ఫార్మర్ ఐడీల కోసం (గుర్తింపు సంఖ్య) నమోదు చేసుకోవాలని ఏఓ సీహెచ్ ప్రసాద్ పేర్కొన్నారు. మండలంలోని బీరుపాడు గ్రామంలో మంగళవారం ఆయన పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు వ్యవసాయ సేవలు సులభంగా అందించేందుకు భారత ప్రభుత్వం ప్రతీ రైతుకు ప్రత్యేక గుర్తింపు సంఖ్యను తప్పని సరి చేస్తోందన్నారు. కావున రైతులంతా ఆధార్, వన్ బీ, ఆధార్ లింక్ అయిన మొబైల్ ఫోన్‌తో రైతు సేవా కేంద్రాలకు వెళ్లి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. అలాగే రబీ పంటల సాగులో చేపట్టవలసిన సస్యరక్షణ చర్యలపై అవగాహన కల్పించారు. ఆయన వెంట వ్యవసాయ సిబ్బంది ఉన్నారు.

బంద్‌కు సహకరించాలని ప్రచారం



కురుపాంలో బంద్‌కు సంబంధించిన కరపత్రాలు అందజేస్తున్న నేతలు

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): శాసనసభ స్పీకర్ అయ్యన్న పాత్రుడు 1/70 చట్టాన్ని సవరణ చేయాలని చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ.. 1/70 చట్టాన్ని పకడ్బందీగా అమలు పర్చాలన్న డిమాండ్‌తో బుధవారం నిర్వహించనున్న మన్యం బంద్‌కు వ్యాపారులంతా స్వచ్ఛందంగా ముందుకు వచ్చి మద్దతును అందజేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు ఆధ్వర్యంలో గిరిజన సంఘం నాయకులు ఎం.శ్రీనివాసరావు, పి.తిరుపతిరావు, కె.సీతారాం తదితరులు కోరారు. ఈ మేరకు సోమవారం కురుపాం మండల కేంద్రంలోని వ్యాపారులు, వర్తకుల వద్దకు వెళ్లి బంద్‌కు మద్దతునివ్వాలని కోరుతూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాము చేపట్టే ఈ బంద్ ద్వారా నిరసన వ్యక్తం చేసి ప్రభుత్వానికి కనువిప్పు కలిగించాలన్నారు.

రహదారి భద్రతపై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఆర్టీసీ సిబ్బంది

పాలకొండ: రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా రోడ్డు రవాణా శాఖాధికారులు మంగళవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్టీసీ డిపో మేనేజర్ పి. వెంకటేశ్వరరావు విద్యార్థులకు రహదారి ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. రహదారి నియమాలు పాటించి పలువురికి ఆదర్శంగా నిలవాలని సూచించారు. ఆయనతో పాటు ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

ఫార్మర్ రిజిస్ట్రేషన్ తప్పనిసరి



రైతులతో మాట్లాడుతున్న ఏఓ సింహాచలం

భామిని: వ్యవసాయ భూమి కలిగిన ప్రతి రైతూ విధిగా ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి కె.సింహాచలం అన్నారు. మండలంలోని గురండిలో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం నిర్వహిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతుకు విశిష్ట నంబర్ కేటాయించడం వల్ల సంక్షేమ పథకాలకు అర్హత లభిస్తుందని చెప్పారు. వ్యవసాయ సహాయకుడు ఈశ్వరరావు, రైతులు పాల్గొన్నారు.

లోకోస్ యాప్‌పై అవగాహన అవసరం



మాట్లాడుతున్న డీఆర్‌పీ సత్యవాణి

గరుగుబిల్లి: మహిళా సంఘాల వివరాలను సమగ్రంగా పొందుపరచే లోకోస్ యాప్‌పై సభ్యులకు అవగాహన అవసరమని డీఆర్‌పీ సత్యవాణి పేర్కొన్నారు. మండల కేంద్రంలో లోకోస్ యాప్‌పై అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళా సంఘాలకు సంబంధించిన పూర్తి స్థాయి వివరాలను నమోదు చేసేందుకు కేంద్ర మినిస్ట్రీ ఆఫ్ రూరల్ డవెలెప్‌మెంట్ మంత్రిత్వ శాఖ లోకోస్ యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చిందన్నారు. ఈ యాప్‌లో సభ్యుల వివరాలు నమోదు చేస్తే తీసుకున్న రుణం, సబ్సిడీ, ఖాతాల్లో ఉన్న నగదు నిల్వలు, సంఘ పురోగతి వివరాలు తెలుసుకొనేందుకు అవకాశం ఉంటుందన్నారు. లోకోస్ యాప్‌పై ప్రతీ ఒక్కరు అవగాహన కలిగి ఉండాలన్నారు. ఏపీఎం పి.అప్పలనాయుడు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వివిధ గ్రామాలకు చెందిన వీఓఏలు, సీసీలు సీహెచ్ తిరుపతిరావు, బి.రామినాయుడు, లక్ష్మణరావుతో పాటు పలువురు పాల్గొన్నారు.

కనులపండువగా మహాలక్ష్మి పేరంటాల ఉత్సవం

- ఘనంగా సామూహిక కుంకుమ పూజలు




కుంకుమ పూజలు చేస్తున్న భక్తులు

వీరఘట్టం: మండలంలోని తెట్టంగి గ్రామంలో మంగళవారం ఆధ్యాత్మిక శోభ నెలకొంది. గ్రామంలో మూడు రోజులుగా జరుగుతున్న గుజ్జల వంశీకుల ఇలవేల్పు మహాలక్ష్మి పేరంటాల 48వ వార్షికోత్సవం కనుల పండువగా జరిగాయి. వేదపండితుల ఆధ్వర్యంలో ఆలయ ధర్మకర్త గుజ్జల నారాయణరావు, జయలక్ష్మి దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. వీరితో పాటు గ్రామానికి చెందిన 300 మంది దంపతులు సామూహిక కుంకుమ పూజలు చేపట్టారు. అనంతరం ప్రతి మహిళకూ కిలో పసుపు కొమ్ములు, అమ్మవారి చీరను ధర్మకర్తలు అందజేశారు.

అమ్మవారిని దర్శించుకున్న విజయనగరం మేయర్ దంపతులు..

తెట్టంగిలో జరుగుతున్న మహాలక్ష్మి పేరంటాల ముగింపు ఉత్సవాల్లో విజయనగరం మేయర్ వెంపటాపు విజయలక్ష్మి, శ్రీనివాసరావు దంపతులు పాల్గొని అమ్మవారి దర్శించుకుని పూజలు చేశారు. వీరికి ఆలయ ధర్మకర్త గుజ్జల నారాయణరావు, జయలక్ష్మి దంపతులు సాదరంగా ఆహ్వానించి అమ్మవారి పసుపు, కుంకుమ, గాజులు అందజేశారు.

ఆకట్టుకున్న అమ్మవారి ఉత్సవ విగ్రహం..



150 కిలోల పసుపు కొమ్ములతో రూపొందించిన అమ్మవారి విగ్రహం

ముగింపు ఉత్సవాల సందర్భంగా 150 కిలోల పసుపు కొమ్ములతో 15 అడుగుల ఎత్తుగల మహాలక్ష్మి అమ్మవారి విగ్రహాన్ని పూజా ప్రాంగణంలో ఏర్పాటు చేశారు. ఈ విగ్రహాన్ని తిలకించేందుకు గ్రామస్తులతో పాటు సమీప గ్రామాల ప్రజలు రావడంతో తెట్టంగి గ్రామం భక్తులతో కిటకిటలాడింది.